

బ్రహ్మోత్సవాలలో నేడు
ఉదయం: 7 గంటలకు మహారథోత్సవం | రాత్రి: 7-9మధ్య అశ్వవాహనం





అలంకారప్రియుడు.. పూలరంగడు.. తిరుమలేశుడు. సకల జగత్తుకూ జీవదాతలైన సూర్య చంద్రులనే తన వాహనాలుగా మలచుకున్న మాయగాడు. మంగళవారం ఉదయం సూర్యప్రభమీద ఊరేగిన స్వామి, రాత్రి చంద్రప్రభపై విహరించాడు. మెడలో నూరువరహాల ఎర్రెర్రని పూదండతో పగలు సోయగాలు చిందించిన శ్రీనివాసుడు, రాత్రి మల్లెపూమాల ధరించాడు.

సూర్య చంద్రులే వాహనాలుగా...

నూరువరహాల సోయగం

బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే వాహన సేవల్లో సూర్యప్రభవాహనం ఒకటి. అత్యంత బరువుతో కూడిన ఈ వాహనంపై కొలువుదీర్చే మలయప్పస్వామికి విశేష పుష్పాలంకరణ చేస్తారు. సూర్యుడికి ప్రతీకగా ఎర్రటి నూరువరహాల పూలను వినియోగిస్తారు. 40 కిలోలపూలతో అల్లిన మాలను మలయప్పస్వామికి అలంకరించారు. కిలో రూ.10 వేల ధర కలిగిన కురువేరును నూరువరహాల పూలమాల కిందనే వినియోగించారు. సంపంగి, కనకాంబరం పూల మాలలను కూడా స్వామికి అలంకరించడంతో సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి ప్రత్యేక అందాలతో భక్తుల హృదయాలను దోచుకున్నారు.

మల్లెపూల పరిమళం

రాత్రి చంద్రప్రభ వాహనంపై 60 కిలోల మల్లెపూల మాల ధరించిన మలయప్ప మాడవీధుల్లో భక్తులకు కనువిందు చేశాడు. వెన్నెరేడు చందురుడు. ఆయనకు ప్రతీకగా తెల్లని పూలను రాత్రి అలంకరణలో వాడారు. మల్లె పూలకు ఇది కాలం కాకపోయినా టీటీడీ ఉద్యానవన విభాగం మూడు బృందాల ద్వారా వీటిని సేకరించింది. పుత్తూరు పరిసర ప్రాంతాలు, మధురై వంటి ప్రాంతాల నుంచి కిలో దాదాపు రూ.800 పెట్టి వీటిని తీసుకువచ్చారు. అల్లిన మల్లె మాలలో స్వామి అందం ఇనుమడించింది. ఈ వాహనసేవలోనూ ఐదు కిలోల కురువేరును వినియోగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన సేవల్లో ప్రదర్శనలు ఇవ్వడానికి 28 రాష్ట్రాల నుంచి 6,960 మంది కళాకారులు వచ్చారు. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహన సేవ వరకు దాదాపు 6,400 మంది కళాకారులు తమ అద్భుత విన్యాసాలతో భక్తులను అలరించారు.



24వ తేది రాత్రి పెద్ద శేషుడితో స్వామివారి వాహన సేవలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి జరగనున్న అశ్వ వాహనంతో ముగియనున్నాయి.

గ్యాంగ్ రేప్ కలకలం

నిందితుల విషయంలో రాజకీయ రగడ

మీవాళ్లంటే మీవాళ్లన్న టీడీపీ, వైసీపీ



చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):ఆలస్యంగా వెలుగుచూసిన గ్యాంగ్ రేప్ ఘటన చిత్తూరు నగరంలో కలకలం రేపింది.నిందితులు రాజకీయ కార్యకర్తలు కావడం అధికార,విపక్షాల మధ్య ఆరోపణలు,ప్రత్యారోపణలకు వేదికైంది.

అసలేం జరిగిందంటే..

పూతలపట్టు మండలానికి చెందిన ఓ బాలిక చిత్తూరులో ఇంటర్మీడియట్ చదువుకుంటోంది.గత గురువారం బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి మురకంబట్టు సమీపంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నీవా నగరవనం' పార్కుకు వెళ్లింది. అక్కడ చిత్తూరుకు చెందిన ముగ్గురు యువకులు హేమంత్, మహేష్, కిశోర్ ఆ ప్రేమజంటను చూసి టార్గెట్ చేశారు. వారి వద్దకు వెళ్లి అటవీశాఖ సిబ్బందిగా పరిచయం చేసుకున్నారు. అనంతరం వారిని ఫొటోలు, వీడియోలు తీసి వారి తల్లిదండ్రులకు పంపిస్తామని బెదిరించారు. ఆ ముగ్గురిలో ఒకరు 'మా మేడం పిలుస్తోంది రా' అని జంటలోని అబ్బాయిని దూరంగా పిలుచుకు వెళ్లగా మిగిలిన ఇద్దరు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు.తర్వాత మూడవ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు.బాధితురాలు ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పగా సోమవారం పార్కు వద్ద ఆ ముగ్గురిలో ఇద్దరికి దేహశుద్ధి చేసి చిత్తూరు తాలుకా పోలీసులకు అప్పగించారు.మరొకడు పరారయ్యాడు.ఈ నేపథ్యంలో సోమవారం బాధితురాలి బాయ్‌ఫ్రెండ్ (18) ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు హత్యాయత్నం, రాబరీ, చంపుతామని బెదిరించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మంగళవారం వైసీపీ సోషల్ మీడియాలో గ్యాంగ్ రేప్ విషయం వైరల్ కావడంతో పోలీసులు బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం ఆమెను చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించారు.ఆమె ఫిర్యాదు మేరకు ఆ కేసుకు మరిన్ని సెక్షన్లు జోడించారు.పోక్సో గ్యాంగ్ రేప్‌తో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లను అప్పటికే నమోదైన కేసుకు జత చేశారు. నిందితులకు సంబంధించి వైసీపీ సోషల్‌మీడియాలో రాజకీయ రంగు పులమడం వివాదాస్పదమైంది.ఈ నేపథ్యంలో డీఎస్పీ సాయినాథ్, సీఐలు మహేశ్వర్, శ్రీధర్‌నాయుడుమీడియాతో మాట్లాడుతూ 'అత్యాచార ఘటనలో అలసత్వం, పక్షపాతం లేకుండా పూర్తి పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నాం.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు మానుకోవాలి'అని సూచించారు.

నిందితులు ఎవరంటే..

హేమంత్ చిత్తూరు నగరం సంతపేటకు చెందినవాడు.రాజకీయాలతో సంబంధం లేదు.కిశోర్ రెండు నెలల క్రితం దాకా వైసీపీలో యాక్టివ్‌గా తిరిగేవాడు. వినాయకచవితి పండుగనాడు టీడీపీలో చేరాడని చెబుతున్నారు. అయితే నిందితులకు టీడీపీ సభ్యత్వం లేదని, వినాయకచవితి ఉత్సవాలకు ఆహ్వానించేందుకు వచ్చారని ఎమ్మెల్యే జగన్మోహన్ చెబుతున్నారు.రాజకీయాలతో సంబంధం లేకుండా కూలి పనులతో జీవనం సాగించే మహేష్ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరినట్లు చెబుతున్నారు. హేమంత్, కిశోర్ ఓ ప్రైవేటు బ్యాంకులో లోన్ సెక్షన్ సేల్స్ ఆఫీసర్లుగా పనిచేసేవారు. హేమంత్ మానేయగా, కిశోర్ కొనసాగుతున్నారు.





రేప్ కేసు నిందితుడితో విజయానంద రెడ్డి వున్న ఫొటో చూపిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

వైసీపీ పోస్టులతో రాజకీయ కలకలం

గ్యాంగ్ రేప్ విషయాన్ని మంగళవారం వైసీపీ పలు వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో వైరల్ చేసింది. నిందితులు కిశోర్, మహేష్ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో వున్న ఫొటోలను పోస్ట్ చేసింది. దీంతో టీడీపీ వాళ్లు కూడా విజయానందరెడ్డితో, పెద్దిరెడ్డితో నిందితులు కలిసి ఉన్న ఫొటోలను బయటపెట్టారు. అంతేకాకుండా ఎమ్మెల్యే జగన్మోహన్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 'అత్యాచార ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి. వాళ్లు మా పార్టీ వాళ్లు కాదు. సభ్యత్వం కూడా లేదు. వైసీపీ వాళ్లే. వినాయక చవితి ఉత్సవాలకు ఆహ్వానించేందుకు లోకల్ టీడీపీ లీడర్లతో కలిసి నా వద్దకు వచ్చినప్పుడు ఫొటోలు తీసుకున్నారు' అని వివరణ ఇచ్చారు. ఆ తర్వాత వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి కూడా ప్రెస్‌మీట్ పెట్టారు. 'గ్యాంగ్ రేప్ ఘటనను మొదట సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది మా వాళ్లే. ఆ తర్వాతే పోలీసులు రంగంలోకి దిగారు. నిందితులు గతంలో మా పార్టీలో వున్నవారే కానీ వాళ్ల వైఖరి నచ్చక పంపించేశాం' అని చెప్పుకొచ్చారు.



రేప్ కేసు నిందితుడితో ఎమ్మెల్యే జగన్మోహన్ వున్న ఫొటో చూపిస్తున్న విజయానంద రెడ్డి



పవళింపు సేవలో చిత్తూరు గిరింపేట దుర్గమ్మ

దుర్గాదేవిగా బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): బోయకొండ దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవి అలంకారంలో గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. రెండు చేతుల్లో శంఖుచక్రాలు, మరో రెండు చేతుల్లో విల్లంబులు, ఇంకో చేతిలో ఖడ్గం, మరో చేతిలో కమలం, ఇంకో చేతిలో గద, మరో చేతిలో త్రిశూలం ధరింపజేసి స్వర్ణాభరణాలతో అలంకరించి దుర్గాదేవిగా పులిపై అదిష్టింపజేసి ధూపదీప, నైవేద్యం సమర్పించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి రూ.114.79 కోట్లు విడుదల

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా మొదలు కానుంది. 2,68,770 మందికి అవసరమైన రూ.114.79 కోట్ల నిధులు జిల్లాకు వచ్చాయి. మంగళవారం సెలవు దినం కావడంతో గ్రామ, వార్డు ఉద్యోగులు సోమవారమే పింఛన్ మొత్తాలను బ్యాంకుల నుంచి డ్రా చేసి, పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నారు. బుధవారం ఉదయం 6.30 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్ము అందజేయనున్నారు. ఈ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

నేడు యథావిధిగా పెన్షన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులందరూ బుధవారం నుంచి పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని, ఇందులో ఎటువంటి అవరోధాలు లేవని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి రవికుమార్ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఆందోళన కారణంగా సకాలంలో నగదు అందుతుందో లేదో అన్న సందిగ్ధత లబ్ధిదారుల్లో నెలకొంది. అయితే సచివాలయ సిబ్బంది అందరూ పింఛన్ల పంపిణీలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు వ్యవసాయ యంత్రాల ప్రదర్శన

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించిన క్రమంలో రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద వ్యవసాయ యంత్రాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు.ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అదేవిధంగా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. ఇవే కార్యక్రమాలు మండల కేంద్రాల్లోనూ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.



'బెస్త' కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమరావతి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లె పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్త రామశివ భార్య పి.అమరావతిని నియమితులయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అమరావతి కుటుంబం పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసింది. ఈమె 2005లో తగ్గువారిపల్లెలో వార్డు మెంబరుగా, 2013లో సర్పంచుగా గెలుపొందారు. అనంతరం మండల తెలుగు మహిళ అధ్యక్షురాలిగా కొనసాగారు. ఈ సందర్భంగా అమరావతి మాట్లాడుతూ.. తనకీ పదవి ఇవ్వడంపై సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే మురళీమోహన్‌కు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్సీ ధరణీప్రసాద్‌కు, గౌరవ అధ్యక్షుడు ఎన్సీ జయప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.టీడీపీ నాయకులు జనార్దన గౌడ్, హేమచంద్రనాయుడు, లోకనాథనాయుడు, కోదండయాదవ్, కోకా ప్రకాష్‌నాయుడు, చంద్రశేఖర్, జాకీర్ హుస్సేన్, రాధాకృష్ణమనాయుడు, హరిప్రసాద్, రమేష్, గురజాల సురేంద్రనాయుడు హర్షం వ్యక్తం చేశారు.

కుప్పానికి రెండు డైరెక్టర్ పదవులు

కుప్పం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గానికి మరో రెండు రాష్ట్రస్థాయి పదవులు లభించాయి. ఆంధ్రప్రదేశ్ కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా ఆర్.శరవణ కుమార్ నియమితులయ్యారు. అలాగే బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా పి.తిరుమగల్ అవకాశం పొందారు.

కళా నీరాజనం







● 28 రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు

● ఆధ్యాత్మికానందాన్ని పంచుతున్న ప్రదర్శనలు

కథాకళి.. 'గోవింద'రాజు

కనులు, కనుబొమ్మలు తిప్పుతూ, గాల్లో ఎగురుతూ, చక్కటి హావ భావాలతో 'కథాకళి' ప్రదర్శన ఇచ్చిన ఇతడి పేరు గోవిందరాజు. కేరళ రాష్ట్రం. బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. ఐపీఎస్ కావాలన్నది లక్ష్యం. దీనికోసం సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. దీనికోసం చిన్నప్పటి నుంచి ఎంతో మక్కువతో నేర్చుకున్న నృత్యానికీ కొంత దూరమయ్యారు. కానీ, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనకు అవకాశం రాగానే, అన్నిటినీ పక్కన పెట్టి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనం ముందు 'కథాకళి' ప్రదర్శనతో భక్తుల మనసు దోచుకున్నారు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల గిరులు ఆటపాటలతో హోరెత్తిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వాహనసేవల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులను తన్మయులను చేస్తున్నాయి. శాస్త్రీయ నృత్యాలు, జానపదాలు, పౌరాణిక వేషధారణలు.. ఎటు చూసినా అందమే! రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్, గుజరాత్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఛతీస్‌ఘడ్, పంజాబ్, మణిపూర్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ఇలా మొత్తం 28 రాష్ట్రాల నుంచి 6,960 మంది కళాకారులుఆడిపాడి అలరించారు. మంగళవారం పగలు సూర్యప్రభ వాహనం ముందు, రాత్రి చంద్రప్రభ వాహన సేవలో తొమ్మిది రాష్ట్రాలకు సంబంధించిన 21 బృందాల్లోని 491 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తాదుల మనస్సును దోచుకున్నారు.టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, ఎస్వీ సంగీత నృత్య కళాశాల, దాససాహిత్య ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు.

కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగి మణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



వి.కోట పురవీధుల్లో పాల కలశాలతో ప్రదర్శనగా వస్తున్న మహిళలు - ఆలయంలో దుర్గమ్మకు పాలాభిషేకం - దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ - తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ మెమొంటోను స్వీకరిస్తున్న దామోదర రెడ్డితో ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు

రికార్డు స్థాయిలో శోభాయాత్ర

● దుర్గమ్మకు 4501 పాల కలశాలతో అభిషేకం

వి.కోట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శోభాయాత్రతో వి.కోట వీధులు మంగళవారం శోభిల్లాయి.దుర్గాష్టమిని పురస్కరించుకుని వి.కోటలోని దుర్గమ్మ ఆలయానికి 4501పాల కలశాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి పాలాభిషేకం నిర్వహించారు.దుర్గామాత ఆలయ కమిటీ నేతృత్వంలో ఉదయాన్నే వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు వేలాదిగా మహిళలు చేరుకున్నారు. పట్టణంలోని దేవాలయాల ధర్మకర్తలు, పట్టణ ప్రముఖులు వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాలకలశాభిషేకాన్ని ప్రారంభించారు.అక్కడినుంచి మంగళవాయిద్యాలు, పండరి భజనల నడుమ శోభాయాత్ర ఆంజనేయస్వామి ఆలయం మీదుగా దుర్గమ్మ ఆలయం దాకా కొనసాగింది.ప్రధాన రహదారి వద్దకు యాత్ర చేరుకోగానే పోలీసులు ట్రాఫిక్ నిలిపేశారు.దీంతో ప్రధాన రహదారిలో ఎటుచూసినా పాలకలశాలతో సుమారు కిలోమీటరు మేర మహిళలు బారులు తీరారు.అమ్మవారి నామస్మరణతో వి.కోట పట్టణం మార్మోగింది.వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర 10.30 గంటలకు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడ ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రక్రియతో మహిళల నుంచి పాలను సేకరించిన అర్చకులు అమ్మవారికి సమర్పించారు. సుమారు మూడు గంటల పాటు క్యూలో నిలుచుని మహిళలు భక్తి, శ్రద్ధలతో అమ్మవారికి పాలకలశాలను సమర్పించారు. దుర్గాష్టమి పర్వదినం కావడంతో దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో వి.కోట భక్తజనసంద్రంగా మారింది. ఆంధ్రరాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జరిగిన ఈ శోభాయాత్ర తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.4501మంది మహిళలు పాల కలశాలను రెండు కిలోమీటర్ల మేర ప్రదర్శనగా తీసుకొచ్చి నాలుగు గంటల వ్యవధిలో అమ్మవారికి సమర్పించడం రికార్డుగా నమోదు చేసినట్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి నారాయణస్వామి తెలిపారు.14ఏళ్లుగా ఏటా దుర్గమ్మకు పాలకలశాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. 108పాలకలశాలతో మొదలైన ఈ శోభాయాత్ర అంచెలంచెలుగా ఈ ఏడాది 4501కలశాలకు ఎదిగింది. శోభాయాత్ర ముగిశాక నారాయణస్వామి ఆలయ ధర్మకర్త ఎస్.ఆర్.దామోదర రెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు చేతుల మీదుగా దామోదర రెడ్డి గుర్తింపు అవార్డును అందుకున్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



అజయ్‌జైన్‌కు వరసిద్ధుడి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, వాణిమోహన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (సీఎస్) అజయ్‌జైన్ కుటుంబ సమేతంగా మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆలయ ఏఈవో రవీంద్రబాబు ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే సీనియర్ ఐఏఎస్ అధికారి వాణిమోహన్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఈనెల ఏడో తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ అంశంపై స్థానిక ఎన్జీవో హోంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మణిగండన్ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకుడు నరోత్తం రెడ్డి మాట్లాడుతూ.. టీచర్లను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు తదితర హామీలను అధికార పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 16నెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు రమణ, మునీర్, రామమూర్తి, మదన్‌మోహన్, జగదీష్, చిట్టిబాబు, ప్రభాకర్, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు చెల్లించండి : ఆపస్

సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కరువు భత్యం చెల్లించిన సమయంలో వారి అరియర్స్‌కు సంబంధించి 90శాతం నగదును సీపీఎస్ ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాలో జమచేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం నుంచి ఈ మొత్తం జమకాలేదని, ఈ మొత్తాన్ని వెంటనే సీపీఎస్ ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

'మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తారా?'



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న విజయానందరెడ్డి, నారాయణస్వామి, సునీల్‌కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం వైసీపీ ఆధ్వర్యంలో నేతలు నిరసన తెలిపారు. చిత్తూరు దర్గా కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి, జీడీనెల్లూరు మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామి, పూతలపట్టు ఇన్‌చార్జి సునీల్‌కుమార్‌తోపాటు వైసీపీ నేతలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. నాయకులు కేపీ శ్రీధర్, మధురెడ్డి, అన్ను, రజినికాంత్, అనూ, గాయత్రిదేవి, హరిణిరెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు శ్రీగంధం స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలతీర్థం వద్ద గల నగరవనంలో మంగళవారం అటవీశాఖ అధికారులు ఇద్దరు శ్రీగంధం స్మగ్లర్లను అరెస్టు చేశారు. మూడు శ్రీగంధం ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజర్ సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు టీఎన్‌పాళెం సెక్షన్ అటవీ శాఖ అధికారులు నగరవనంలో తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు శ్రీగంధం చెట్లను నరుకుతూ కనిపించడంతో పట్టుకున్నారు. వారి నుంచి 11.40 కేజీల బరువు ఉన్న మూడు శ్రీగంధం మొక్కలను, ఓ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. వాహనం సహా పట్టుబడిన శ్రీగంధం విలువ రూ.3లక్షలు ఉంటుందని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్‌వో చైతన్య, ఎఫ్‌బీవోలు కిషోర్, శివకుమార్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు వ్యవహారంలో ఇరువర్గాల ఘర్షణ

● గొడవ పెద్దది కావడంతో పోలీసుల లాఠీచార్జి



రోడ్డుపై బైఠాయించిన ఇరువర్గాలు - ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ పెట్రోల్ బంకు వ్యవహారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గొడవ పెద్దదికావడంతో పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు హైరోడ్డులో ఓ మహిళకు పెట్రోల్ బంకు ఉంది. ఈ బంకును పుంగనూరుకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి లీజుకు తీసుకుని నడుపుతున్నాడు. అదే పెట్రోల్ బంకు లీజు కోసం చిత్తూరు రామ్‌నగర్‌కాలనీకి చెందిన ఎల్లయ్య సదరు మహిళకు రూ.25 లక్షలు ఇచ్చాడు. దీనిపై మంగళవారం సాయంత్రం ఎల్లయ్య, కొంతమందితో కలిసి పెట్రోల్ బంకును స్వాధీనం చేసుకోవడానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బంకును నడుపుతున్న ప్రకాష్‌కు, ఎల్లయ్యకు మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాల వారూ రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే ఇరువర్గాలవారు బాహాబాహీకి దిగారు. పరిస్థితి చేయి దాటుతుండటంతో ఇరువర్గాలపై పోలీసులు లాఠీచార్జి చేసి, చెదరగొట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

● ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో వైసీపీ శ్రేణులు తప్పుడుపోస్టులు పెట్టారని చెప్పారు.నిజానికి నిందితులు వినాయక చవితి ఉత్సవాలకు తనను ఆహ్వానించేందుకు వచ్చారని, ఆ సందర్భంగా తీసిన ఫొటోలను పెట్టి సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కావడంతో అనేక మంది తనతో ఫొటోలు తీసుకుంటుంటారని , అంతమాత్రాన టీడీపీకి ఆపాదించడం సరైనది కాదన్నారు. సదరు నిందితులు పక్కా వైసీపీ కార్యకర్తలేనంటూ చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ విజయానంద రెడ్డితో ఉన్న ఫొటోలను చూపించారు.తనపై తప్పుడు ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యాచారానికి పాల్పడిన వారిని పార్టీలకతీతంగా శిక్షించాలని చెప్పారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధిని ఎలాగైనా అడ్డుకోవడమే ప్రధాన ఎజెండాగా వైసీపీ ఇలాంటి కుట్రలు పన్నుతోందని చెప్పారు.ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా నగరాభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. టీడీపీ నేతలు త్యాగరాజన్, ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, నవీన్, రాజశేఖర్, గోపాల్, నరేష్, లీలావతి, ఉదయ్, పచ్చప్ప, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం చేసింది టీడీపీ వాళ్లే

● వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసింది ముమ్మాటికి టీడీపీ వారేనని చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాలికపై అత్యాచార ఘటనను ముందుగా సోషల్ మీడియాలో పెట్టడంతోనే పోలీసుల్లో చలనం వచ్చిందన్నారు.ఈ కేసు నిందితులు ఎన్నికలకు ముందు వైసీపీలో ఉన్న మాట వాస్తవమేనన్నారు.అయితే తర్వాత వారి ప్రవర్తన నచ్చక పార్టీ నుంచి పంపించేశామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని చెప్పారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాము ప్రశ్నిస్తే కేసులు పెట్టడం తప్ప వేరే ఏమి చేయలేరన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలన్నారు. చిత్తూరు అభివద్ధిని ఎప్పుడూ అడ్డుకోమని.. అభివృద్ధి పేరుతో అవినీతి, అక్రమాలు చేస్తే ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.వైసీపీ నేతలు జ్ఞాన జగదీశ్, గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జీవిత ఖైదీకి బంగారు పతకం

ఏర్పేడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న జి.యుగంధర్ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ నుంచి బంగారు పతకం అందుకున్నాడు. ఏర్పేడు మండలం జంగాలపల్లెకు చెందిన ఇతడికి.. ఒక హత్యకేసులో 2011 జూలై 18న జీవితఖైదు పడింది. కడప కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ కారాగారంలోకి వచ్చినప్పటి నుంచి ఓల్డ్‌పాటర్న్‌లో రెండు బీఏలు, న్యూపాటర్న్‌లో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టంలో రెండు బీఏలు, మూడు ఎంఏలు పూర్తి చేశాడు. కంప్యూటర్ ట్రైనింగ్, కార్పెంటరీ ట్రైనింగ్ స్కిల్ సర్టిఫికెట్లు పొందాడు. ప్రస్తుతం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ సబ్జెక్టులుగా బీఏ పూర్తి చేశాడు. ఇందులో 8.02 జీపీఏ సాధించి బంగారు పతకానికి ఎంపికయ్యాడు. మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ 26వ స్నాతకోత్సవంలో యుగంధర్‌కు డిగ్రీ పట్టాతో బంగారు పతకాన్ని అందించారు. కడప జైల్లో జీవితఖైదు అనుభవిస్తున్న యుగంధర్ ఓపెన్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ చూపించి బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉందని జైలు పర్యవేక్షణాధికారి రాజేశ్వర్‌రావు, ఉప పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఘనంగా స్వర్ణ కుప్పం కార్యక్రమం

కుప్పం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో మంగళవారం సాయంత్రం స్వర్ణ కుప్పం-స్వచ్ఛ కుప్పం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. నేలపై గాంధీజీ చిత్రాన్ని చిత్రించి చీకటి పడుతున్న సమయంలో దీపాలు వెలిగించి సంబరాలు జరిపారు. వక్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణ కుప్పం సాకారానికి కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నారని చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్. మునిరత్నం, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





విద్యుత్ టవర్ మీద వేలాడుతున్న శివ - శివను రక్షించేందుకు వలయంలో వలను పట్టుకున్న పోలీసులు

దూకేస్తున్నా...!

● విద్యుత్ టవరెక్కిన కర్ణాటక యువకుడు
● రక్షించేందుకు వలతో పోలీసుల విఫలయత్నం
● దూకడంతో కమ్మీలు తగిలి మృతి



పోలీసులు రక్షించే క్రమంలో తలకు బలమైన గాయమై అపస్మారకస్థితిలోనున్న శివ

రేణిగుంట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దూకేస్తా.. ఆత్మహత్య చేసుకుంటా.. అంటూ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన కర్ణాటక యువకుడి ఉదంతం విషాదంగా మారింది. రేణిగుంట మండలం గురవరాజపల్లిలో మంగళవారం ఈ ఘటన జరిగింది. కర్ణాటక రాష్ట్రం కడూరు ప్రాంతానికి చెందిన శివ(27) ఈనెల 27న శ్రీవారి దర్శనానికి బంధువులు, స్నేహితులతో కలిసి వచ్చారు. తిరుగు ప్రయాణంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటానంటూ వచ్చేశారు. మంగళవారం ఉదయం గురవరాజపల్లిలోని 220 కేవీ విద్యుత్ టవరెక్కిన ఆయన ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ జయచంద్ర సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారించారు. ఇంతలో అతడి సెల్‌ఫోను కింద పడింది. ఇందులోని నెంబర్ల ఆధారంగా కర్ణాటకకు చెందిన శివగా గుర్తించారు. అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఒకవేళ శివ దూకితే రక్షించడానికి వలను సిద్ధం చేశారు. మరోవైపు పోలీసులు టవర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తే వైరును పట్టుకుని వేలాడుతూ దూకేస్తాననేవాడు. చివరకు కిందకు దూకగా.. వలలో ఒడిసి పట్టుకునే సమయంలో టవర్ కమ్మీలు శివ తలకు తగలడంతో అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. ఇటీవల అల్లం పంటలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయి మానసికంగా కుంగిపోయినట్లు శివ బావ గిరీష్ తెలిపారు. మద్యం తాగిన సమయంలో రెండుమూడుసార్లు ఆత్మహత్యకు యత్నించగా అడ్డుకోగా.. చివరకు తిరుపతిలో తమనుంచి తప్పించుకుని ఇక్కడ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

దసరాకు ఆర్టీసీ సన్నద్ధం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా పండగ రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబరు 1వ తేదికి చిత్తూరు 1, 2 డిపోల నుంచి రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనంగా 17 సర్వీసులను నడపనున్నట్లు డీపీటీవో రాము తెలిపారు. చిత్తూరు నుంచి విజయవాడ, హైదరాబాద్‌కు 5 బస్సులు,చిత్తూరు-బెంగుళూరుకు 20 బస్సులు,తిరుపతి- బెంగుళూరుకు 10 సర్వీసులు అదనంగా నడపనున్నారు.దసరా పండుగ అనంతరం తిరుగు ప్రయాణానికి చిత్తూరు-హైదరాబాద్‌కు అదనంగా రెండు సర్వీసులు, చిత్తూరు- బెంగుళూరుకు అదనంగా 20 సర్వీసులను అదనపు ఛార్జీలేవీ లేకుండానే నడిపేందుకు సిద్ధమయ్యారు. రానూపోనూ ఒకే సారి రిజర్వేషన్ చేయించుకుంటే ఛార్జీల్లో 10 శాతం రాయితీని కల్పిస్తున్నాట్లు డీపీటీవో రాము తెలిపారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారి విహారం



పెనుమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలిగిరి కొండలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు మంగళవారం ఉదయం సూర్య ప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై విహరించారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ దిలీప్, ప్రధానార్చకుడు వాసుదేవాచార్యులు పాల్గొన్నారు.

గట్టువారిపల్లెలో ఏనుగుల దాడులు



సోమల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ గట్టువారిపల్లె పొలాల్లోకి సోమవారం రాత్రి నాలుగు ఏనుగులు చేరుకున్నాయి. పులిచెర్ల మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు నుంచి నాలుగు ఏనుగులు దారి మళ్లి గట్టువారిపల్లె రావడంతో సురేంద్ర, కృష్ణయ్యలకు చెందిన వరి, టమోటా, మామిడి తోటల్లో తిరగాడి పంటలను ధ్వంసం చేశాయి. అలాగే టమోటా తోటలోని కర్రలు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నెలరోజుల తర్వాత మళ్లీ మండలంలోకి ఏనుగులు ప్రవేశంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంట్లో మందలించారని యువతి ఆత్మహత్య

వి.కోట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన వి.కోటకు చెందిన మురుగేష్ కుమార్తె శోభ (20) మంగళవారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గదిలో నుంచి ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో తలుపులు తొలగించి చూడగా ఆమె ఉరేసుకుని కనిపించింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగానే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార ఘటన మా దృష్టికి రాలేదు: ఎఫ్ఆర్వో

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మురకంబట్టు పరిధిలోని నగరవనంలో బాలికపై అత్యాచార ఘటన తమ దృష్టికి రాలేదని ఎఫ్ఆర్వో పట్టాభి తెలిపారు. నిందితులు.. తాము అటవీశాఖ సిబ్బందని చెప్పి ప్రేమజంటను బెదిరించి, బాలికపై అత్యాచారం చేశారన్న ఘటనపై మంగళవారం ఆయన స్పందించారు. ఇందులో అటవీశాఖ సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇలాంటి ఘటనలు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

స్విమ్స్ ఓపీ, ఓటీలకు రేపు సెలవు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు, 30(ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా గురువారం స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రమే యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. రోగులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కళాకారులకు ఆర్థిక సాయం


డ్యాన్స్ మాస్టర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ముఖేశ్

కుప్పం, సెప్టెంబరు 30 ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యతో ప్రతిభను ప్రదర్శించే వీలు లేక అవకాశం కోల్పోతున్న దళిత నృత్య కళాకారులైన చిన్నారులను కొత్తపేట టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ఆదుకున్నారు. వడ్డిపల్లె డ్యాన్స్ మాస్టర్ పర్యవేక్షణలో నృత్య శిక్షణ పొందుతున్న చిన్నారులకు బెంగళూరులో జరుగబోయే పోటీలలో ప్రతిభను ప్రదర్శించే అవకాశం వచ్చింది. అయితే రాకపోకలకు, సదుపాయాలకు ఆర్థిక స్తోమత లేక ముఖేశ్‌ను ఆశ్రయించారు. ఆయన మానవత్వంతో స్పందించి మంగళవారం వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ముఖేశ్ మాట్లాడుతూ చిన్నారుల్లోని ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి వారికి ఆయా కళా రంగాల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. చిన్నారులు నృత్య పోటీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

రొంపిచెర్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని శివాలయం వద్ద నూతనంగా ఆంజనేయస్వామి, సూర్యభగవాన్, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని చెంచెమరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన చంద్రగిరి కుటుంబ సభ్యులచే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తిరుపతి జిల్లా సీబీడీ డీఎస్పీ పద్మలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అక్రమ నిర్మాణాలు


పలమనేరులో జాతీయ రహదారి పక్కనే జరుగుతున్న నిర్మాణాలు

పలమనేరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో జాతీయ రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా మున్సిపాలిటీ మరుగుదొడ్లు ఉన్న స్థలం పక్కనే అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పోలీసులు, మున్సిపల్ ప్లానింగ్ అధికారులు, జాతీయ రహదారి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టవేయాలని స్థానికులు కోరుతున్నారు.

సహకార రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


ర్యాలీలో పాల్గొన్న సింగిల్‌విండో అధ్యక్షుడు సునీల్‌కుమార్ రెడ్డి తదితరులు

సదుం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార శాఖ, డీసీసీబీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు కల్పిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షులు సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో వ్యవసాయ రుణాలు, సమాచార హక్కు చట్టం అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కనీసం 10 సెంట్ల సెటిల్మెంట్ భూమి కలిగి, ఐదుగురు మహిళలు గ్రూపుగా దరఖాస్తు చేసుకుంటే డీసీసీబీ బ్యాంకు నుంచి రూ.2.5 లక్షల రుణం పొందవచ్చన్నారు. అలాగే కోళ్ల పరిశ్రమ, భూఅభివృద్ధికి సరళతరంగా రుణాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంకు మేనేజర్ నాగమణి, సింగిల్ విండో సీఈవో రమణయ్య, టీడీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, విశ్వనాథ నాయుడు, దేవేంద్ర, కృష్ణయ్య, గౌతమ్ రెడ్డి, జగన్, అబ్బిరెడ్డి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మలకొలువు


సాయిగార్డెన్ సిటీలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

గంగవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల కేంద్రంలోని సాయి గార్డెన్ సిటీలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. దసరా సందర్భంగా సాయిగార్డెన్ సిటీలో కాపురముంటున్న సోమశేఖర్, సరస్వతి దంపతులు సంప్రదాయాలకు అనుగుణంగా వందలాది బొమ్మలను ఒకచోట కొలువుదీర్చి పూజలు చేపట్టారు. కళామందిరం నిర్వాహకులు తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులు హాజరై ప్రతి తెలుగు ఇంట సంప్రదాయబద్ధంగా దసరా పండుగ చేపట్టడానికి కృషిచేయాలని కోరారు.

వీఎల్‌వోగా వనజాక్షి సేవలు ఆదర్శనీయం


వనజాక్షిని సన్మానిస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

గంగవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో 30 ఏళ్లపాటు నిజాయితీగా పనిచేసిన వనజాక్షి సేవలు ఆదర్శనీయమని.. ఆశాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం కల్లుపల్లె పశువైద్యశాలలో వీఎల్‌వోగా పనిచేస్తున్న వనజాక్షి పదవీ విరమణ సందర్భంగా గంగవరం పశువైద్యశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలమనేరు పశుసంవర్ధక శాఖ ఏడీ సుజాత, పశువైద్యులు కల్పన, ప్రియాంక, వినూత కుమారి, విశ్రాంత తహసీల్దార్లు కృష్ణమూర్తి, వెంకటకృష్ణయ్య, ఎన్‌జీవో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతియాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు జీఎస్టీపై అవగాహన సదస్సు

సోమల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సూపర్ జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పశుసంవర్ధకశాఖకు సంబంధించిన పరికరాలు ప్రదర్శన ఉంటుందని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్మాతకు జేజేలు..!

● ఘనంగా దసరా ఉత్సవాలు ● ఊరూరా దేవతామూర్తుల దివ్యదర్శనం


పలమనేరు: దుర్గాదేవి అలంకరణలో తిరుపతి గంగమ్మ


చౌడేపల్లె: బోయకొండలో ప్రత్యేకాలంకరణలో కలశ స్థాపన


బోయకొండలో అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు


చౌడేపల్లె: ఉభయదారులచే హోమం చేయిస్తున్న వేదపండితులు


రామకుప్పం: పసుపు అలంకరణలో సప్తమాతృకా సహిత చౌడేశ్వరమ్మ

● కుప్పం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పెద్దవంక గ్రామంలో పాలారు నదీ తీరంలో వెలసిన కనకనాచమ్మకు మంగళవారం దుర్గాష్టమిని పురస్కరించుకుని వైభవంగా పూజలు జరిగాయి. ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి పుష్పాలంకరణలు చేశారు. ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు గ్రామాల ప్రజలే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్ల పట్టణం బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉభయదారులుగా జొన్నగడ్ల సుధాకర్, పోతేపల్లి నరహరి గుప్త వ్యవహరించారు.

● **పలమనేరు:** పలమనేరులోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పలమనేరు గంటావూరు కాలనీలోని తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ చేశారు. సత్యగంగమ్మ గుడిలో దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

● **పుంగనూరు:** కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం అష్టలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విరూపాక్షి మారెమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి, మండలంలోని చదళ్ల సమీపంలోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

● **సోమల:** మండలంలోని కందూరు కన్యకా పరమేశ్వరి అమ్మవారు మంగళవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పత్రపల్లె ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా, కందూరు పాలేటమ్మ, సోమల బోయకొండ గంగమ్మ, సోమల గీతాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లను అలంకరించారు.

● **చౌడేపల్లె:** బోయకొండ గంగమ్మకు మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో చండీ, ప్రత్యంగిరాదేవి హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారు మంగళవారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. చౌడేపల్లెలోని అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి మహిషాసురమర్దినిగా, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వెలసిన నాంచారమ్మ దుర్గాదేవిగా, చౌడేశ్వరీదేవి మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● **కల్లూరు:** పులిచెర్ల మండలం గెలసంవారిపల్లిలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి దుర్గాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు చేపట్టారు.

● **సదుం:** జాంద్రపేటలోని రామలింగ చౌడేశ్వరి దేవి మహిషాసురమర్దిని అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవత సదుమమ్మ పూలరథంపై దుర్గాదేవిగా, పచ్చార్లమాకులపల్లెలోని గంగాపురమ్మ దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

● **రామకుప్పం** : కంబాలదేవులపల్లె గ్రామంలోని సప్తమాతృకా సహిత చౌడేశ్వరమ్మ ఆలయంలో మంగళవారం దుర్గాష్టమి పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పసుపు, బంగారు ఆభరణాల అలంకరణ చేశారు. రామకుప్పంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కాశీవిశ్వేశ్వరాలయం, ఆనిగానూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కంబాలదేవులపల్లె సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు.


కుప్పం: పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన కనకనాచమ్మ


రొంపిచెర్ల : సరస్వతి దేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


చౌడేపల్లె: దుర్గాదేవిగా మూలస్థానం అమ్మవారు


బోయకొండలో అమ్మవారి సేవలో ఆర్డీవో భవాని


సోమల: కందూరులో కన్యకా పరమేశ్వరీదేవి


పుంగనూరు: చదళ్లలో దుర్గాదేవిగా చౌడేశ్వరీదేవి


పుంగనూరు: దుర్గాదేవిగా విరూపాక్షి మారెమ్మ


చౌడేపల్లె : దుర్గాదేవి అలంకరణలో వైష్ణవిదేవి


రామకుప్పంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


రామకుప్పం: ఆనిగానూరులో వాసవీ కన్యకాపరమేశ్వరి


సదుం: మహిషాసురమర్దినిగా రామలింగ చౌడేశ్వరీదేవి


కల్లూరు: ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

6న వాహనాల వేలం

కుప్పం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ నేరాలలో పట్టుబడిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు అక్టోబరు 6వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. కుప్పంలోని శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు తీసుకుని ఉదయం 9 గంటలకు ఎక్సైజ్ స్టేషన్‌లో హాజరై ముందస్తు ధరావతు సొమ్ము చెల్లించి టోకెన్ తీసుకోవాలని సూచించారు. వేలంలో పాల్గొని హెచ్చు ధరకు వాహనాలను దక్కించుకున్నవారు వెంటనే సంబంధిత సొమ్ము మొత్తానికి జీఎస్టీతోపాటు చలానా కట్టి అదేరోజు వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. అలా చేయని పక్షంలో ముందుగా చెల్లించిన ధరావతు సొమ్ము తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం


మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

పెద్దపంజాణి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపికైన శాంతమ్మను వాల్మీకి సంఘ నేతలు సన్మానించారు. మంగళవారం మండలంలోని శంకరాయలపేటలో వారికి శాలువతో సత్కరించి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ గంగప్ప, వాల్మీకి సంఘ నేతలు శంకరప్ప, రాజ్‌కుమార్, మధుసూదన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా


ధర్నాలో పాల్గొన్న వెంకటేపల్లె గ్రామస్తులు

వి.కోట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం దానమయ్యగారిపల్లె వద్ద వెంకటేపల్లె గ్రామస్తులు తాగునీటి కోసం ధర్నా చేపట్టారు. గత పదేళ్లుగా తమకు నీరందిస్తున్న ప్రైవేటు బోరు నుంచి నీటిని విడిచేందుకు రైతు నిరాకరిస్తున్నాడని, ప్రభుత్వ బోరు కావాలంటూ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి నచ్చజెప్పి ధర్నా విరమింపచేశారు.

రాతి మసీదు భూములు కాపాడాలి


పోలీసులకు ఫిర్యాదు చేసిన ముస్లిం సోదరులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాతి మసీదుకు చెందిన భూములను కాపాడాలని మంగళవారం మసీదు కమిటీ, ముతవల్లీలు పుంగనూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌడేపల్లె మండలం కాటిపేరి పంచాయతీ గురుమర్దనపల్లె సమీపంలోని దాదాపు 495 ఎకరాల భూమిని గంగిరెడ్డి, వెంకటరెడ్డి మరికొంత మంది కలిసి కౌలుకు సాగు చేసుకుంటూ ప్రస్తుతం నకిలీ పత్రాలు సృష్టించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముత్తువల్లి బాబా ఫక్రుద్దీన్, కార్యదర్శి సద్దాం హుస్సేన్, యూసుఫ్, అంజత్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుబాల

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాశంకాలనీ, బీడీకాలనీ ప్రాంతాల్లోని పేద మహిళలకు పద్మసుగుణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మధుబాల మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి హరగోపాల్, ట్రస్టు కార్యదర్శి కృపాకర్, అయూబ్‌ఖాన్, నరసింహులు, నాగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ శ్రీకాంత్


ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు జ్ఞాపిక అందిస్తున్న అర్చకులు

వి.కోట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో జరిగిన దుర్గమ్మ పాల కలశాల శోభాయాత్రకు మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ సులోచన, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాంబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, శబరీష్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గజేంద్ర, సర్పంచులు విశ్వనాథ్, ప్రవీణ్ కుమార్, శివకుమార్ ఇతర టీడీపీ నేతలు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన శాంతిపురం నేతలు


చంద్రబాబును కలిసిన కృష్ణానాయక్ , శాంతిపురం మండల నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. రామకుప్పం మండలంలో గజదాడుల నివారణకు మరిన్ని చర్యలు తీసుకోవాలని, తాండాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, యువనేత చంద్రబాబునాయక్, శాంతిపురం సింగిల్‌విండో చైర్మన్ గోపాల్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ నాగరాజు, సీనియర్ నేత చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలోనే గ్రామాలాభివృద్ధి


పనులను పరిశీలిస్తున్న రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, ఆనందరెడ్డి

రామకుప్పం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందాయని రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం మండల పరిధి తిమ్మసముద్రం గ్రామంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి , మాజీ సర్పంచి పెరుమాళ్, నేతలు బాలరాజు, సుబ్బి, మురళీమోహన్, పద్మమ్మ, భువనరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

అక్రమ కేసుల ఘనత వైసీపీదే

సోమల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై గతంలో అక్రమ కేసులు పెట్టిన ఘనత వైసీపీ కే దక్కుతుందని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఏఎంసీ యార్డులో టీడీపీ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు మాట్లాడుతూ కొల్లావారిపల్లెలో ఇటీవల జరిగిన సంఘటనపై టీడీపీ నాయకులు ఎలాంటి దాడులు చేయలేదన్నారు. వైసీపీ నాయకులే లబ్ది కోసం అక్రమ కేసులు నమోదు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ బడా నాయకులే ఇసుక అక్రమ రవాణా చేశారని ఆరోపించారు. సింగిల్‌విండో చైర్మన్ శివశంకర్, వేణుగోపాల్ నాయుడు, కొల్లా హరిప్రసాద్, రమేశ్‌నాయుడు, మహేంద్రబాబు, పి.శ్రీనివాసులు, సుబ్బయ్యశెట్టి, బాబూరావ్, మోహన్‌నాయుడు, భానుప్రకాశ్, అష్రఫ్ వల్లీ పాల్గొన్నారు.

హనుమంత, గజవాహనాలపై నారాయణుడి విహారం



హనుమంత వాహనంపై నారాయణ స్వామి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని లక్ష్మీ నారాయణస్వామి ఆలయ నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు హనుమంత, గజ వాహనాలపై పురవీధుల్లో విహరించారు. అలాగే కల్యాణోత్సవం, ఊంజల్ సేవలు కూడా నేత్రపర్వంగా నిర్వహించారు. హనుమంత వాహనసేవకు తిరుపతికి చెందిన గీత, వెంకటరమణారెడ్డి, గజవాహనసేవకు తిరుపతికి చెందిన డాక్టర్ రమ్య, చెన్నైకి చెందిన పార్థసారథి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో మధ్యాహ్నం, రాత్రి ఏర్పాటు చేసిన అన్నదానానికి ఉభయదారులుగా న్యాయవాది మోహనరాజు, బెంగళూరుకు చెందిన శ్రీకాంతి, శైలేంద్ర వ్యవహరించారు.

నా భూమికి వేరొకరికి పాస్‌బుక్ ఇస్తారా?

విచారించి, న్యాయం చేయండి

హైకోర్టు సీనియర్ న్యాయవాది డిమాండ్



బుస్సా రాజేంద్ర

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తన భూమికి వేరొకరికి పాస్‌బుక్ ఎలా ఇస్తారని బంగారుపాళ్యం మండలం తుంబపాళ్యంకు చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది బుస్సా రాజేంద్ర ప్రశ్నిస్తున్నారు. మంగళవారం ఆయన చిత్తూరులో మీడియాకు వివరాలు తెలిపారు. ఆయన మాటల్లోనే.. 'వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంబపాళ్యం రెవెన్యూలో రీసర్వే చేపట్టింది. అదే గ్రామానికి చెందిన సుధాకర్ పేరున ఉన్న 0.76 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. మరోవైపు రీసర్వేలో నా పేరుతో ఉన్న 1.80 ఎకరాల భూమితోపాటు రద్దుకాబడిన భూమిని జాయింట్ ఎల్పీఎంగా రికార్డులో పేర్కొన్నారు. జాయింట్ ఎల్పీఎంను రద్దుచేయాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చాను. తర్వాత రెవెన్యూ అధికారులు నా భూమిని ఎల్పీఎం నెంబర్ 306, సర్వే నెం.563డిలో చూపుతూ సుధాకర్ పేరున నమోదుచేసి పాసుపుస్తకాన్ని ఇచ్చేశారు. రాజకీయ నాయకుల పలుకుబడితో కొందరు రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారించి, న్యాయం చేయాలి' అని రాజేంద్ర డిమాండ్ చేస్తున్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం



ర్యాలీలో పాల్గొన్న కృష్ణమ నాయుడు తదితరులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్ల తగ్గింపు పేదలకు వరమని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా గంగాధరనెల్లూరులో మంగళవారం సాయంత్రం టీడీపీనేతలతో కలిసి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాయకులు శ్రీధర్‌యాదవ్, ముప్పిరి మోహన్‌నాయుడు, స్వామిదాస్, దేవసుందరం, హరీష్‌యాదవ్, జ్యోతియాదవ్, ఇమ్మానువేల్, జీవరత్నం, షణ్ముగం, జాన్, దేవరాజు పాల్గొన్నారు.

దిగువపల్లె పెద్దచెరువుకు పూజలు



పెద్దచెరువు వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

పూతలపట్టు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోటుకనుమ దిగువపల్లె పెద్దచెరువుకు గ్రామస్తులు మంగళవారం పూజలు చేసి, హారతులిచ్చారు. ఈనెల పదో తేదీన పీ-4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఆంధ్ర మధుబాబు తన సొంత నిధులతో చెరువుకు కాలువ పనులు చేపట్టాడు. పదిరోజులుగా కురిసిన వర్షానికి చెరువు పూర్తిగా నిండిపోయింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మధుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేటమిట్ట సర్పంచ్ గల్లా రాధాకృష్ణ, చెరువు కమిటీ అధ్యక్షుడు యువరాజులు నాయుడు, మాజీ కమిటీ చైర్మన్ ఆంధ్ర చంద్రబాబు, గురవప్ప నాయుడు, మండల ఎస్సీసెల్ మాజీ ప్రెసిడెంట్ సుబ్బరాజులు, పోతునాయుడు, లక్ష్మీపతి, సుధీర్ నాయుడు, వంశీ చౌదరి, బాలయ్య నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, కార్తిక్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీ దేవిగా మరగదాంబిక

వివిధ రకాల రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు




శ్రీరంగరాజపురం: దుర్గాదేవి అలంకరణలో గంగమ్మ, అన్నపూర్ణాదేవిగా శ్రీమూర్తి అమ్మ



కాణిపాకం: బాలా త్రిపుర సుందరీ దేవిగా మరగదాంబిక



పాలసముద్రం: సరస్వతీదేవిగా చెవిటి గంగమ్మ



గంగాధరనెల్లూరు: దుర్గాదేవిగా అల్లియెల్లమ్మ



విజయపురం: కనకదుర్గమ్మకు గాజుల అలంకరణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కాణిపాకంలోని మరగదాంబిక అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో భక్తులతో కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లెలోని గంగమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా కొప్పెర్ల రమాదేవి, కొప్పెర్ల గోపాల్ నాయుడు కుటుంబీకులు వ్యవహరించారు. వేణుగోపాలపురంలోని వెలసిన శ్రీమూర్తి అమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఉభయదారులుగా గెట్టాం కన్నమ్మ, గెట్టాం రామ మందడి కుటుంబీకులు వ్యవహరించారు.

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో ఉన్న చెవిటిగంగమ్మ.. సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

గంగాధరనెల్లూరు: గ్రామంలోని అల్లియెల్లమ్మ.. దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అభిషేకం, దుర్గాదేవి అలంకరణ పూజలకు దిగువూరుకు చెందిన టైలర్ కలవకుంట సుబ్రమణ్యంశెట్టి, కస్తూరమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కలకుంట మురళి, రాధ దంపతులు, కలవకుంట విజయ్, ఈశ్వరి కుటుంబీకులు ఆలయం వద్ద అన్నదానం చేశారు.

విజయపురం: మిట్టూరులోని కనకదుర్గమ్మకు గాజుల అలంకరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ కొండమల్లీశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరీ దేవి.. దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కార్వేటినగరం మండలం దేరాకండ్రిగలోని నైనేరమ్మ.. దుర్గాదేవిగా భక్తులను కటాక్షించారు. ఉభయదారులుగా సుబ్రహ్మణ్యం, భారతీ దంపతులు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త బుర్రా ఆనంద్, కె.భాస్కర్, కె.వాసు, పి.పవన్, అమరావతి, వరలక్ష్మి, బి.రాము, కె.మాధవులు, ఏలుమలై పాల్గొన్నారు.

నింద్ర: ప్రసన్న వినాయక స్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం కుంకుమార్చన నిర్వహించారు.

బంగారుపాళ్యం: గ్రామదేవత ముత్యాలమ్మ.. మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా నిర్మల, కామరాజు, భారతి, వెంకటస్వామి,లక్ష్మి, రామలింగారెడ్డి, కల్పన, హరికృష్ణ వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

నగరి: పట్టణంలోని దేశమ్మ.. రాజరాజేశ్వరీదేవిగా, కరకంఠేశ్వర ఆలయంలోని కామాక్షి దేవి.. గంగాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుగ్గ అగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం చేశారు. ఓంశక్తి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం ఉభయదారుగా వ్యవహరించి అన్నదానం చేశారు.




వెదురుకుప్పం: డీఆర్ఎన్‌కండ్రిగలో దుర్గాదేవిగా రాజరాజేశ్వరీ దేవి, దేరాకండ్రిగలో దుర్గాదేవిగా నైనేరమ్మ



నింద్ర: దుర్గాదేవిగా అమ్మవారు



బంగారుపాళ్యం: మహిషాసురమర్దినిగా ముత్యాలమ్మ




నగరి: రాజరాజేశ్వరీ దేవిగా దేశమ్మ, గంగాదేవిగా కామాక్షి దేవి




గిరింపేట దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు - చౌడేశ్వరి ఆలయ ఆచారం ప్రకారం ఉత్సవర్లను ఊరేగిస్తున్న దేవాంగ సాలి వంశస్తులు

గిరింపేట దుర్గమ్మకు పవళింపు సేవ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా గిరింపేటలోని దుర్గాంబకు మంగళవారం పవళింపు సేవ నిర్వహించారు. పాలక మండలి చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక చౌడేశ్వరి ఆలయ ఆచారం ప్రకారం దేవాంగ సాలి వంశస్తులు.. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కట్టమంచి సాయికృపా అపార్ట్‌మెంట్‌లోని సాయిబాబా ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పొన్నియమ్మ గుడివీధిలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామి విశ్వరూపం, రాముల వారి గుడివీధిలోని కోదండరామస్వామి ఆలయంలో రామావతారం, తేనెబండలోని ముత్యాలమ్మ దేవాలయంలో మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు, గిరింపేట శివగామి సుందరి అమ్మ సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థానంలో బియ్యపు పిండి అలంకారంలో స్వామివారు భక్తులను అనుగ్రహించారు.



కట్టమంచి సాయిబాబా ఆలయంలో దుర్గాదేవి అలంకారం



కోదండరామస్వామి ఆలయంలో రామావతారం



వీరాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయుడి విశ్వరూపం

వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేక పూజలు ప్రారంభం

నింద్ర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కచ్చరవేడులో నూతనంగా నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ మహా కుంభాభిషేక పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి ఎనిమిది రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



హోమం పూజల్లో పాల్గొన్న భక్తులు



తవణంపల్లె మహిళా మార్టు ముందున్న రోడ్డు దుస్థితి

గుంతలమయంగా రహదారి

తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తవణంపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తవణంపల్లెలోని మహిళా మార్టు ముందు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనం గుంతలో దిగడంతో వెనుక కూర్చొన్న వృద్ధురాలు అదుపుతప్పి బస్సు టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఇప్పటికైనా ఈ గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

నీవానదిలోకి గ్రానైట్ వ్యర్థాలు

నీరంతా కలుషితమవుతోందని స్థానికుల ఆవేదన

యాదమరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జోడి చింతల వద్ద నీవానదిలోని నీరు గ్రానైట్ రాయి పరిశ్రమల వ్యర్థాలతో కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రానైట్ పరిశ్రమ ఫ్యాక్టరీలు తమ వ్యర్థాలను నేరుగా నదీప్రవాహంలోకి వదిలేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఆయా పరిశ్రమలపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జోడిచింతల వద్ద నీవానదిలో కలుస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీ వ్యర్థాలు

సంక్షిప్తంగా..

నేడు థామస్ పర్యటన

పాలసముద్రం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో బుధవారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ పర్యటించనున్నట్లు ఎంపీడీవో సతీష్ తెలియజేశారు. శ్రీకావేరిరాజుపురం పంచాయతీ అయ్యప్పరాజుకండ్రిగలో ఉదయం 9.30 గంటలకు ఓ రైతు నిర్మించిన ఏసీ పౌల్ట్రీ ఫారాన్ని ప్రారంభిస్తారు. 10.30 గంటలకు వనదుర్గాపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. 11 గంటలకు సీసీ రోడ్లను ప్రారంభించి, మధ్యాహ్నం 12గంటలకు సూపర్ జీఎస్టీ-2పై జరిగే బహిరంగ సమావేశంలో పాల్గొంటారు. 2.30 గంటలకు మండల స్థాయి అధికారులతో సమీక్ష, సాయంత్రం నాలుగు గంటలకు శ్రీరంగరాజుపురం మండలం ఆరిమాకులపల్లెలో ఉన్న గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఎంపీడీవో వివరించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేశారు.

75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు

తవణంపల్లె, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 75 శాతం రాయితీపై అందిస్తున్న జొన్న, మొక్కజొన్న గడ్డి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీధర్ కోరారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధారు కార్డు తీసుకెళ్లి రాయితీపోను మిగిలిన డబ్బు చెల్లించి తీసుకోవచ్చని తెలిపారు.

'కూటమి' కేసులకు భయపడం

● నారాయణస్వామి

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళవారం 49.కొత్తపల్లెమిట్టలో డిజిటల్ బుక్ యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించి, ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని గ్రహించిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తమ నాయకులకు, కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరించారని చెప్పారు. లిక్కర్‌కు ఏమాత్రం సంబంధంలేని ఎంపీ మిథున్‌రెడ్డిపై రాజకీయ కక్షతోనే అక్రమంగా కేసు పెట్టడం జరిగిందన్నారు. వైసీపీ నాయకులు గురవారెడ్డి, శ్యామ్‌రాజ్, విజయబాబు, రాజశేఖర్, మణి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్యాశిక్షణ

పెనుమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వృత్తివిద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఓ బేకరీలో పఫ్‌లు, బిస్కెట్లు, స్వీట్లు, కేకుల తయారీని చూపించారు. హెచ్ఎం రమేష్‌బాబు, ట్రైనర్ మోహన్ పాల్గొన్నారు.